# ఎన్నిక



శరశ్చంద్ర

ఎన్నికల కాల మొచ్చేసింది. అన్ని పక్షు(క్షా)లు తమతమ ప్రచారాల్ని ఉధృతం చేశాయి. బానర్లు, కరపత్రాలు, వాగ్దానాల జోరుతో వూరంతా నిండిపోయింది. అదేమన్నా సాదా సీదా ఎలక్షనా? పార్లమెంట్ ఎలక్షనాయే! ప్రతిపక్షాలకు గట్టి పోటీ యిస్తాడనుకున్న వినాయకరావు మాత్రం నామినేషన్ వేసి ప్రచారం లేకుండా నిశ్శబ్దంగా వుండిపోయాడు.

“ఎదుటి పార్టీ దగ్గర డబ్బు తిని విరమించుకున్నా డనుకున్నారు కొందరు.

“ఆఎట్టాగూ గెలవడులే అని ఆశ వదిలేసుకున్నాడ”ను కున్నారు కొందరు.

ఆయన రంగంలోకి దిగకపోవటం వలన ఎన్నికల ప్రచారం రంజుగా లేదని మాత్రం అందరూ అనుకున్నారు.

ఆయన వంది మాగధులు వెర్రెత్తిపోయారు. ఈ మౌనవ్రతాన్ని విడవమని చెవుల్లో ఎ.సి. బిల్డింగ్ కట్టుకొని మరీ చెప్పారు.

“ఇప్పటికైనా మించిపోయింది లేదు.

మీరు ఊఁ అనండి - మిగతా కార్యక్రమం మేం చూస్తాం” అన్నారు.

ఆయన బుర్రమీసాల వెనకనుండి తొంగి చూసిన చిర్నవ్వే జవాబయింది. కాని, ఆయన ‘ఊఁ’ అనలేదు. అంతా ఓడిపోయినట్టే ననుకొని ఆశ వదిలేసుకున్నారు.

ఎలక్షన్లు రెండ్రోజుల్లో కొచ్చేశాయ్.

అప్పుడు పడక కుర్చీలో నుండి లేచారు ఆయన. ప్రక్కగది తలుపులు తెరిచారు. గదంతా నిండి వున్న కరపత్రాల్ని చూసి మూర్ఛపోయారు కొందరు.

“ఇన్నాళ్ళు నుండి పంచకుండా ఈయనకిదేమి పిచ్చి” అని ఆశ్చర్యపోయారు మరి కొందరు. ఒక్కొక్కళ్ళకొక్కొక్క బొత్తి నిచ్చి వూరంతా పంచమన్నారు. అందులో ఇలావుంది.

“నా ప్రియతమ ప్రజలారా!

నేను ఎలక్షను నుండి తప్పుకున్నానని అందరూ అనుకుంటున్నారు- కాని, అది నిజం కాదు- చక్కటి తెల్లని శుభ్రమైన మీ యింటి ప్రహరీ గోడల్ని రంగు నీళ్ళతో ఖరాబు చేసి మీకు నష్టం కల్గించటం యిష్టం లేక ఆ పని మానేశాను. ఇది పరీక్షల కాలమని అందరికీ తెలుసు. అందుకే, మైకులతో మీటింగు పెట్టి, మీ పిల్లల భవిష్యత్తుని నిర్ణయించే చదువుని పాడు చెయ్యటం యిష్టం లేక, మీ ముందుకు రాలేదు. వాగ్దానాలు విని వినీ విసుగెత్తిన మీకు మరి కొన్ని వాగ్దానాలు చెయ్యటం నా కిష్టం లేదు. నేను కార్యవాదిని, చెప్పను. చేసి చూపి స్తాను! కనుక, దయచేసి, నన్నర్థం చేసుకొని, మీ ఓటు నా కివ్వవలసిందిగా మిమ్మల్నందర్నీ ప్రార్థిస్తున్నాను.”

ఆ మరు రోజు జరిగిన ఎలక్షన్లలో వినాయకరావు మూడు లక్షల ఓట్ల మెజారిటీతో గెలిచాడు.

మినీకథ

# అపురూప



-చిట్టా దామోదరశాస్త్రి

“పాత పుస్తకాలు అమ్ముకుని బతుకుతావ్రటా! వద్దన్నా వినకుండా నా పేరు నీకు పెట్టాడ్రా మీ నాయన! నీవేమో వంశగౌరవాన్ని భ్రష్టుపట్టిస్తున్నావ్” ఓ ముసలాయన తనలో తానే మాట్లాడుతున్నట్టు గొణుగుతున్నాడు. రాఘవయ్య చూశాడు. “తాతయ్యా! మీ కాలం వేరు. మా కాలం వేరు. మీ కాలంలో హోటళ్ళున్నాయా? అప్పు డన్న మమ్మటమంటే మహాపాపం. ఈనాడో, హోటళ్ళు లేకపోతే పొరుగూళ్ళో మనం బతగ్గలమా? ఇప్పుడెంత పెద్ద హోటలు పెడితే అంత పెద్ద ధనవంతుడన్నమాట. నువ్ పుస్తకాలమ్మరాదంటావ్! నేను దానం పుచ్చుకుని అమ్ముతున్నానా? కొని అమ్ముతున్నాను. లాభాని కమ్ముతున్నాను. పూర్వకాలం వ్యాపారం వైశ్యులు చేసేవారు. ఇప్పుడు వ్యాపారస్తుడు కాని వాడెవడు?” అంటూ తన వ్యాపారాన్ని సమర్థించాడు రాఘవయ్య. “ఇన్ని కొత్త పుస్తకాల షాపులుండగా, నీ పాత పుస్తకాలు కొనే చాదస్తుడెవడ్రా?” ఆశ్చర్యపోయాడు తాతయ్య. నవ్వాడు రాఘవయ్య. “ఎక్కడా దొరకని పుస్తకాలు కావలసిన పెద్ద మనుషులు ఏళ్ళ తరబడి ఎదురుచూసైనా కొనుక్కుపోతారు తాతయ్యా! ఖరీదైన పుస్తకాల్ని కబురుపెట్టి మరీ అమ్ముతున్నాను. వారు చేసే సారస్వత సేవలో నాకూ భాగముంది తాతయ్యా!” అన్నాడు రాఘవయ్య ఆత్మవిశ్వాసంతో.

రాఘవయ్య చిన్నతనంలో తండ్రి తనకు చిరు ఖర్చులకు డబ్బు ఇవ్వ నిరాకరించగా కసికొద్దీ అదే ఊళ్ళో పాత కాగితాల వ్యాపారిగా మారాడు. ఓ రోజున ఓ ఇంగ్లీషు ప్రొఫెసరుగారి భార్య పాత కాగితాలతోపాటు పాత ఇంగ్లీషు పుస్తకం అమ్మేసింది. అది లాటిన్ డిక్షనరీ. దానికోసం ప్రొఫెసరు పరుగెత్తుకొచ్చాడు. ఆ పుస్తకం లారీలో కుంభకోణం వెళ్ళిపోయిందన్నాడు రాఘవయ్య. ఐతే కారులో తాను కుంభకోణం వెళ్ళి ఆ పుస్తకమే కొనుక్కొస్తానన్నాడు ప్రొఫెసర్. రాఘవయ్య నవ్వి ఆ పుస్తకం తన దగ్గరే వుందన్నాడు. ఏనుగెక్కినంత సంతోషించాడు ప్రొఫెసరు. అట్లా మొదలైంది రాఘవయ్య పాత పుస్తకాల కొత్త వ్యాపారం.

అతనికొకసారి ఆముక్తమాల్యద అట్టల్లేని పుస్తకం వ్యాఖ్యానంతో వున్నది, పాత పుస్తకాలతో వచ్చింది. తెలుగు పాఠాలతోపాటు జీవిత సత్యాల్ని, విలువల్ని మనసుకు పట్టించిన రంగాచార్యులు మాష్టారు గుర్తు వచ్చారు రాఘవయ్యకు. ఆ పుస్తకం ఆయనకు బహుమానంగా ఇచ్చి తన వ్యాపారం గురించి చెప్పి, ఆశీర్వదించమన్నాడు.

“నాయనా! పూర్వం మూర్ మార్కెట్టుండేది. ఎక్కడెక్కడివాళ్ళు మద్రాసుపోయి ఆ మార్కెట్లో పుస్తకాలు కొనుక్కొచ్చేవారు. నీ వ్యాపారం మూడు పూలు ముప్ఫయ్ కాయలు కావాలి”— అని ఆశీర్వదించారు రంగాచార్యులుగారు. “నా షాపును సెంటర్లోకి మారుస్తున్నాను. పేరేం పెట్టను?” అడిగాడు రాఘవయ్య. ఒక్క క్షణం ఆలోచించిన ఆచార్యులుగారు తల పంకిస్తూ “అపురూప పుస్తక భాండార్” అన్నారు.

కాలం గిర్రున తిరిగింది. నాలుగైదేళ్ళ తరువాత ఓ పాత పుస్తకంకోసం రంగాచార్యులుగారు నడి బజారుకు నడిచి వెళ్ళారు. రాఘవయ్య పరుగున ఓ మేడనుంచి దిగి వచ్చాడు. ఆచార్యులవారు తలెత్తి మేడను ఆశ్చర్య పోతూ చూశారు. అది అందాల సుందరిలా తుది మెరుగులు దిద్దుకుంటూంది. దానిమీద పెద్దక్షరాల్తో ‘అపురూప’ అని చెక్కి వుంది.